సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 24 । జూలై । 2025



ముగియనున్న గడువు

కేటీపీఎస్ సొసైటీ పాలకవర్గ పదవీ కాలం వచ్చే నెల 4న ముగియనుండగా కొత్త కమిటీలో చోటు కోసం పలువురు ప్రయత్నిస్తున్నారు. 8లో



ఊపందుకోనున్న వరినాట్లు

ఇటీవలి వానలతో వరినాట్లు వేగం పుంజుకుంటున్నాయి. ఈ ఏడాది 1.95 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
27° / 24°

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైభవంగా రుద్ర హోమం

నందీశ్వరుడికి అభిషేకం



శివాలయంలో నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రుద్రహోమం, శివాలయంలో నందీశ్వరుడుకి అభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజ గావించి రుద్రహోమం, చివరకు పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. హోమంలో పాల్గొన్న వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాపారావు, చందుపట్ల రమ్య, చీకటి కార్తీక్ పాల్గొన్నారు.

భద్రాచలం సబ్ కలెక్టర్‌గా మ్రినాల్ శ్రేష్ఠ



మ్రినాల్‌శ్రేష్ఠ

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం సబ్ కలెక్టర్‌గా మ్రినాల్ శ్రేష్ఠను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బిహార్ రాష్ట్రానికి చెందిన మ్రినాల్ 2023లో విడుదలైన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఆలిండియా 449వ ర్యాంక్ సాధించారు.

ఆర్డేళ్ల తర్వాత ఐఏఎస్ నియామకం..

భద్రాచలం సబ్ కలెక్టర్‌గా ఆర్డేళ్ల తర్వాత ఐఏఎస్ అధికారిని నియమించారు. 2018 నుంచి 19 వరకు ఇక్కడ భవేష్ మిశ్రా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత వచ్చిన వారంతా ఆర్డీఓ స్థాయి అధికారులే. ఇప్పుడు ఐఏఎస్ అధికారి అయిన మ్రినాల్ శ్రేష్ఠను నియమించారు. భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు తాజాగా బదిలీ అయ్యారు. కాగా, మ్రినాల్ శ్రేష్ఠ గతంలో ఖమ్మంలో ట్రెయినీ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో తాలిపేరుతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి వరదనీరు వస్తుండగా బుధవారం ఉదయం 17 అడుగులు ఉన్న నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతూ రాత్రికి 19 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో నీటిమట్టం మరింతగా పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు.

కేజీబీవీని సందర్శించిన జేడీ



డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న వెంకటనర్సమ్మ

జూలూరుపాడు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) సర్వ శిక్షా అభియాన్ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ బుధవారం సందర్శించారు. 8, 9 తరగతుల విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించి, గణితం బోధించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ తరగతులను పరిశీలించారు. వంటలను పరిశీలించి, మెనూ సక్రమంగా పాటిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ హజారి శిరీష, ఎంఈఓ బానోత్ జుంకీలాల్, కేజీబీవీ ఎస్ఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.



అలరిస్తున్న 'వెన్నెల'

మణుగూరు మండలంలోని రథంగుట్ట అభయాంజనేయస్వామి సమీపంలో అర్బన్ పార్క్‌లో ఉన్న వెన్నెల జలపాతం పర్యాటకులను అలరిస్తోంది. గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గుట్టపై నుంచి జలం జాలువారుతూ కనువిందు చేస్తోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు సందర్శనకు భారీగా తరలివస్తున్నారు. – మణుగూరు రూరల్



ఉప్పొంగిన వాగులు



కరకగూడెం :ఉధృతంగా ప్రవహిస్తున్న సమత్ భట్టుపల్లిలోని బూడిదవాగు

జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు

- మణుగూరులో అత్యధికంగా 189 మి.మీ.వర్షపాతం
- పలు ప్రాంతాల్లో నిలిచిన రాకపోకలు
- బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మొదలైన వానలు బుధవారం ఉదయం వరకూ కొనసాగాయి. జోరు వానలతో పలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపైకి వరద నీరు రావడంతో అనేక గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా పినపాక నియోజవర్గంలో ఏకధాటిగా వర్షం కురవడంతో మణుగూరు పట్టణం జలదిగ్బంధం అయింది. మున్సిపాలిటీలో పరిధిలోని గాంధీనగర్, మేదరబస్తీ, సుందరయ్యనగర్, వినాయకనగర్ తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఆయా కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుధవారం ఉదయం 8 గంటల వరకు మణుగూరులో 189 మి.మీ.వర్షపాతం నమోదైంది. గతేడాది ఆగస్టులో పట్టణం నీట మునగగా.. మళ్లీ అలాంటి పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మేదర బస్తీ శివారు కృష్ణమందిర్ ఏరియాలో పలు నివాసాలు ముంపునకు గురి కాగా, ఇళ్లలోని ముఖ్య సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే ఉదయం 11 గంటల తర్వాత వరుణుడు శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గాంధీనగర్, సుందరయ్యనగర్ శివారు మొట్టువాగు, కట్టువాగులు పొంగినప్పటికీ.. కట్టువాగు, మొట్టువాగు పూడికతీత పనులు కొంతమేర ముంపు ముప్పును తప్పించాయని స్థానికులు అంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఆర్డీఓ దామోదర్‌రావు, తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సీఐ నాగబాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ తదితరులు ఆయా కాలనీల్లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు.

నీటమునిగిన పంటలు..

వరుసగా రెండు రోజుల పాటు వర్షం కురవడంతో పలు చోట్ల పంటలు నీటమునిగాయి. ఇప్పుడిప్పుడే నాట్లు వేస్తున్న వరితో పాటు మొలకెత్తిన పత్తి పంటల్లో అధికంగా నీరు చేరడంతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లిలో బూడిదవాడు ఉధృతంగా ప్రవహించడంతో దానిపై గల బ్రిడ్జి రహదారి కోతకు గురైంది. అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి భారీ వాహనాలు రాకుండా చర్యలు చేపట్టారు. పినపాక మండలం బయ్యారం పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పినపాక – కరకగూడెం, బయ్యారం – మణుగూరు ప్రధాన రహదారిపై వరద ప్రవహిస్తోంది. జానంపేటలో పంటలు నీట మునిగాయి. తోగూడెం శివారులోని కల్వర్టు కోతకు గురికగా అధికారులు రాకపోకలు నిలిపేశారు. దుమ్ముగూడెం మండలంలో వర్షంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తుతోంది. దీంతో పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి, దుమ్ముగూడెం వద్ద గోదావరి పెరుగుతోంది. పర్ణశాలలో నారచీరల ప్రాంతంలోకి నీరు రాగా సీతమ్మవారి విగ్రహం సగం మేర మునిగిపోయింది. సున్నంబట్టి – బైరాగులపాడు, కాశీనగరం – చిన్న నల్లబల్లి గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. ఇల్లెందు మండలం రాఘబోయినగూడెం పెద్దచెరువు అలుగు పోసింది. అలుగుపై ఉన్న వంతెన మీదుగా వరదనీరు ప్రవహించడంతో పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

సింగరేణికి నష్టం..

ఏకధాటిగా కురిసిన వర్షంతో సింగరేణి మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం 36 వేల టన్నులకు గాను 20 వేల టన్నులే ఉత్పత్తి చేయగా, బుధవారం 3 వేల టన్నులు మాత్రమే వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. ఓసీ–2లో చేరిన వరద నీటిని ఎత్తిపోసే పంపులు సైతం నీటమునిగాయి.



పినపాక : బయ్యారం - మణుగూరు ప్రధాన రహదారిపై నిలిచిన నీరు



మనుగూరుటౌన్ : సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న కాలనీ వాసులు



దుమ్ముగూడెం : అలుగుపోస్తున్న గుబ్బల మంగి వాగు ప్రాజెక్టు



ఇల్లెందు రూరల్ : రాఘబోయినగూడెం పెద్దచెరువు మత్తడి నుంచి ప్రవహిస్తున్న వరద



కరకగూడెం: బంగారుగూడెంలో ఇంట్లోకి చేరిన వరద నీరు

ఖ్యాతి పెంచేలా ఎర్త్ సైన్సెస్



అధికారులు, ఎమ్మెల్యే కూనంనేనితో కలిసి సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- మూడేళ్లలో పూర్తి స్థాయి యూనివర్సిటీ నిర్మాణం
- ఆగస్టులో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఈ విద్యా సంవత్సరం నుంచే యూజీ, పీజీ కోర్సులు ప్రారంభం
- సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల, అధికారులు

కొత్తగూడెంఅర్బన్ : ఖనిజ సంపదకు నిలయమైన జిల్లాలో తెలంగాణ ఖ్యాతిని పెంచేలా ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ నిర్మిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇది ప్రపంచంలోనే మొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నిలుస్తుందని అన్నారు. యూనివర్సిటీలో ప్రవేశపెట్టాల్సిన కోర్సులు, మౌలిక వసతులు, భవనాల నిర్మాణం, నిధుల సమీకరణ తదితర అంశాలపై బుధవారం కొత్తగూడెంలోని యూనివర్సిటీ(ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ మైన్స్)లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెలలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ యూనివర్సిటీని ప్రారంభిస్తారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ పేరును ఈ యూనివర్సిటీకి పెట్టడం గర్వించదగిన విషయమన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే బీఎస్సీ, ఎమ్మెస్సీలో జువాలజీ, ఎన్విరాన్‌మెంటల్ కోర్సులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. విశ్వవిద్యాలయ నిర్మాణం కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, వివిధ దేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను సందర్శించి, అక్కడి అనుభవాల ఆధారంగా మౌలిక సదుపాయాలు, కోర్సుల రూపకల్పన చేయాలని అన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపనకు అవసరమైన చర్యలు, కోర్సులు, విద్యార్థుల సంఖ్య వంటి అంశాలపై చర్చించామని తెలిపారు. జిల్లాలోని ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జియాలజీ, భూ విజ్ఞానానికి సంబంధించిన విశ్వవిద్యాలయాలు ఉన్నా, పూర్తిగా ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం మాత్రం ఇదే మొదటిదని స్పష్టం చేశారు. యూనివర్సిటీకి మూడు సంవత్సరాల్లో శాశ్వత భవనాలు, అవసరమైన వసతులు కల్పిస్తామని, ఈ మేరకు నిధులు కేటాయించేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని చెప్పారు.

మూడేళ్లలో మొత్తం కోర్సులు..

విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు మొదలవుతాయని, రాబోయే మూడేళ్లలో అన్ని కోర్సులు అందుబాటులోకి తెస్తామని అన్నారు. భూమిపై అవగాహన, భూమికి సంబంధించి అన్ని పరిశోధనల కోర్సులతో విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. వివిధ దేశాల విశ్వవిద్యాలయాల సమన్వయంతో ఇక్కడి విద్యార్థులకు సౌకర్యాలు, వివిధ రకాల కోర్సులపై ప్రణాళిక రూపొందిస్తామని, ఇందుకోసం మూడు కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన మాట్లాడుతూ.. డాక్టర్ మన్మోహన్ సింగ్ లాంటి గొప్ప వ్యక్తి పేరుతో ఏర్పాటైన ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. శ్రీరాముడు కాలు మోపిన ఈ ప్రాంతంలో అద్భుత యూనివర్సిటీ స్థాపించడం సంతోషకమరని చెప్పారు. దేశంలోని వివిధ రంగాల్లో నిపుణులను కమిటీలో సభ్యులుగా చేర్చడం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిస్థాయి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపనకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభించడం జిల్లా అభివృద్ధికి శుభ పరిణామం అన్నారు. దేశంలోని విద్యార్థులు మెరుగైన ఉద్యోగావకాశాలు సాధించేందుకు ఈ విశ్వవిద్యాలయం తోడ్పడుతుందన్నారు. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ప్రపంచంలోనే జియోలాజికల్ మ్యూజియంగా జిల్లా ఉందని, అద్భుతమైన ఖనిజ సంపద, గోదావరి పరీవాహక ప్రాంతం ఉన్న ఈ జిల్లాలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపనతో మారుమూల ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగమని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, ఉన్నత విద్యామండలి సెక్రటరీ శ్రీరామ్ వెంకటేష్, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్శిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రామచంద్రం, రూసా ప్రతినిధి సౌందర్యజోసెఫ్ పాల్గొన్నారు.

తాలిపేరు.. వరద జోరు

15 గేట్లు ఎత్తి 33వేల క్యూసెక్కుల నీటి విడుదల

చర్ల: తాలిపేరు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో బుధవారం తెల్లవారుజాము నుంచి ప్రాజెక్టుకు చెందిన 15 గేట్లు ఎత్తి 32,981 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తెల్లవారుజామున 8 గేట్లను మూడడుగుల మేర ఎత్తి 15,208 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తుండగా ఉదయం 7 గంటల నుంచి వరద ఉధృతి పెరిగింది. దీంతో మరో 7 గేట్లు కూడా ఎత్తి 28,600 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. దీంతో దిగువన ఉన్న తాలిపేరు నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కొనసాగుతుండుగా ప్రాజెక్టులోకి మరింతగా వరద నీరు వచ్చే ప్రమాదం ఉండడంతో ఈఈ సయ్యద్ అహ్మద్‌జానీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. డీఈఈ తిరుపతి, ఏఈలు ఉపేంద్ర, సంపత్ ప్రాజెక్టు వద్దనే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



తాలిపేరు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

పెరిగిన కిన్నెరసాని





కిన్నెరసాని జలాశయంలో పెరిగిన నీటిమట్టం (ఇన్‌సెట్) సూచిక

పాల్వంచరూరల్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద భారీగా వచ్చి చేరడంతో కిన్నెరసాని జలాశయం నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లో మంగళవారం 399 అడుగుల నీటి మట్టం నమోదైంది. కాగా, ఎగువ ప్రాంతాల నుంచి 16,700 క్యూసెక్కుల వరద నీరు రావడంతో బుధవారం నాటికి నీటిమట్టం 402.50 అడుగులకు పెరిగినట్లు ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు. వరద ఇంకా పెరిగితే గేట్లు ఎత్తే అవకాశం ఉంటుందని, దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

గడ్డి మందుపై నిషేధం విధించాలి

లోక్‌సభలో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: పంటల్లో కలుపు నివారణకు వినియోగిస్తున్న అత్యంత విషపూరితమైన పారాక్వాట్ మందును నిషేధించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. పార్లమెంట్‌లో బుధవారం 377 నిబంధన కింద ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. కలుపు నివారణకు ఉపయోగించే ఈ మందును క్షణికావేశంలో తాగుతున్న రైతులు, ఇతరులు ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. సరైన చికిత్స లేక పలువురు మృతి చెందుతున్నందున కేంద్రప్రభుత్వం నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పారాక్వాట్‌కు ప్రత్యామ్నాయ మందు అందుబాటులోకి తీసుకొచ్చి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కోరారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

బూర్గంపాడు: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదవి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. బూర్గంపాడులోని గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి వసతులు, ఇతర అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం బూర్గంపాడులోని కేజీబీవీని సందర్శించి రాత్రి అక్కడే బస చేశారు.

అటానమస్ కళాశాల సందర్శన..

పాల్వంచరూరల్ : మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలను యోగితారాణా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, మాజీ ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, ఫ్యాకల్టీతో మాట్లాడారు. ఈ కళాశాల అటానమస్ స్థాయికి ఎలా చేరిందని అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు ఇంటింటి క్యాంపెయిన్ చేశామని, ఉత్తీర్ణ శాతం పెంపునకు కృషి చేస్తున్నామని, తమ విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ రాణిస్తున్నారని ప్రిన్సిపాల్ తదితరులు వివరించారు. జీరో అడ్మిషన్లు ఉన్న కాలేజీలు దీన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, ఈ మేరకు చర్యలు చేపట్టాలని ఆమె కమిషనర్ దేవసేనకు సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మను శాలువాతో సత్కరించారు.



పాల్వంచ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న యోగితా రాణా, పక్కన కలెక్టర్, ఇతర అధికారులు

దివ్యాంగ పిల్లలకు సదుపాయాలు కల్పించాలి..

కొత్తగూడెంఅర్బన్ : దివ్యాంగ పిల్లలకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని యోగితారాణా అన్నారు. కొత్తగూడెంలోని భవిత కేంద్రాన్ని సందర్శించి, దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సాధారణ విద్యార్థులతో సమానంగా చదివేలా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం పిల్లలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ట్రెయినీ కలెక్టర్ సౌరభ్ శర్మ, రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు రాజీవ్, మదన్‌మోహన్, ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి, డీఈఓ వెంకటేశ్వరా చారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామయ్య సేవలో దేవసేన



ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దేవసేన తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారిని బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కమిషనర్ దేవసేన దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో పండితులు వేదా శీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, పండితులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: వర్షాలు, వరదల నేపథ్యంలో గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జయలక్ష్మి సూచించారు. బుధవారం ఆమె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి పూర్తి సంసిద్ధంగా ఉండాలన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రోగ్రాంఆఫీసర్ డాక్టర్ మధువరన్, డాక్టర్ పి. స్పందన, డాక్టర్ తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ఎద్దు మృతితో ఆవేదన చెందుతున్న రైతు

టేకులపల్లి: మండలంలోని కుంటల్ల పంచాయతీ అందుగులగూడేనికి చెందిన రైతు గొగ్గెల కోటేశ్వర్‌రావుకు ఎద్దు బుధవారం మేతకు వెళ్లి విద్యుత్ తీగలు తగిలి మృతిచెందింది. విద్యుదాఘాతంతో తన కు జీవనాధారమైన ఎద్దు మృతి చెందిందంటూ బాధిత రైతు కన్నీరు పెట్టుకున్నాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

ముగియనున్న గడువు

- వచ్చే నెల 4 వరకే కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం
- ఈసారి ఏడు నుంచి 13కు పెరగనున్న డైరెక్టర్ పోస్టులు



పాల్వంచలో కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

పాల్వంచ: కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గ ఐదేళ్ల పదవీ కాలం వచ్చే నెల 4వ తేదీతో ముగియనుంది. ఈక్రమంలో ఇప్పటినుంచే కొత్త పాలకవర్గంలో చోటు దక్కించుకునేందుకు పలువురు ఆశావాహులు పావులు కదుపుతున్నారు. తమను గెలిపించాలంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. సొసైటీకి చివరిసారిగా 2019, నవంబర్ 4న ఎన్నికలు జరగ్గా, 5న కొత్త పాలకవర్గం ఏర్పాటైంది. గత కమిటీ 1535, టీఆర్‌వీకేఎస్, 327 యూనియన్ల నేతలు ఎన్నికయ్యారు. ఐదేళ్ల కాలంలో రెండు పాలక వర్గాలు కొలువు దీరాయి. కాగా సొసైటీ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తాయి. అధ్యక్షుడు, కార్యదర్శి, ట్రెజరర్, డైరెక్టర్లను ఎన్నుకుంటారు.

ఓటర్ల జాబితా సిద్ధం

కేటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీలో 3,008 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేసి జిల్లా కో ఆపరేటివ్ అధికారులకు సమర్పించారు. కో ఆపరేటివ్ సొసైటీ కమిషనర్ ఆదేశిస్తే ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లా సహకార శాఖ అధికారులు ఆర్‌సీఎస్(రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటీస్)కు సమాచారం అందించాలి. అనంతరం ఎన్నికల షెడ్యూల్ తయారు చేయారు చేయాలి. ఆ తర్వాత ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని ఒఅండ్ఎం(పాత ప్లాంట్) మూసివేయడంతో పలువురు ఉద్యోగులు వైటీపీఎస్, బీటీపీఎస్ కర్మాగారాలకు బదిలీ అయ్యారు. అయినా వారు కూడా ఇక్కడి ఓటర్ల లిస్ట్‌లోనే కొనసాగనున్నారు.

గతంలో ఏడు.. ఇప్పుడు 13 డైరెక్టర్ పోస్టులు

గతంలో ఏడుగురు డైరెక్టర్ పోస్టులు ఉండగా ఈ సారి 13 డైరెక్టర్ పోస్టులకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డైరెక్టర్ పోస్టులకు ఏడు జనరల్, రెండు బీసీలతోపాటు ఎస్సీ మహిళ, బీసీ మహిళ, ఎస్టీ పురుషులకు రిజ్వరేషన్ ఉండనుంది. దీంతో ఆశావాహుల సంఖ్య మరింత పెరిగింది. రాజకీయ పార్టీ లకు ఏమాత్రం తీసిపోని విధంగా ఇక్కడ ఎన్నికలు జరుగుతుంటాయి. ఒక్కో ఓటుకు కనీసం రూ.10వేల వరకు పంపకాలు చేపడతారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో భారీగా ఖర్చు చేసేందుకు ఆశావహులు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఐదేళ్లలో రెండు పాలక వర్గాలు..

కేటీపీఎస్ సొసైటీ ఐదేళ్ల పదవీకాలంలో రెండు పాలకవర్గాలు కొలువుదీరాయి. 2019లో ఎన్నికైన తర్వాత ప్రెసిడెంట్‌గా దానం నర్సింహారావు, సెక్రటరీగా వల్లమల్ల ప్రకాష్, ట్రెజరర్‌గా మహేందర్, వైస్ ప్రెసిడెంట్‌గా నాగమణి, డైరెక్టర్‌లుగా ధర్మరాజుల నాగేశ్వరరావు, నూనావత్ కేసులాల్ నాయక్, రమణలు ఎన్నికయ్యారు. అనంతరం సొసైటీ సభ్యులుగా ఉన్న 400మంది ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. దీంతో బదిలీ అయినవారి సభ్యత్వాల తొలగించాలనే అంశంపై తీవ్ర వాగ్వాదాలు జరిగాయి. ఈ క్రమంలో నాలుగేళ్ల 8 నెలలు పదవీలో ఉన్న అధ్యక్ష, కార్యదర్శులు తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో గతేడాది జూలై 1న కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధర్మరాజుల నాగేశ్వరరావు, సెక్రటరీగా కేశులాల్, ట్రెజరర్‌గా మహేందర్, వైస్ ప్రెసిడెంట్‌గా నాగమణి, మరికొందరు డైరెక్టర్లుగా రెండో పాలక వర్గం ఏర్పాటైంది.

వర్షాలు.. పత్తి చేలో జాగ్రత్తలు

కేవీకే సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ భరత్



డాక్టర్ టి.భరత్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మూడు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి పంట దెబ్బతినకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.భరత్ బుధవారం వివరించారు.

- పత్తి చేలో నీరు నిల్వకుండా కాలువలు ఏర్పాటు చేసి బయటకు పంపించాలి.
- ఈనెల 20 వరకు మాత్రమే పత్తి విత్తుకుని ఉండాలి. భూస్వభావాన్ని బట్టి తేలిక, మధ్యస్త భూముల్లో 30వ తేదీ వరకు అచ్చు వేసుకుని మొక్కల సంఖ్యను పెంచుకునేలా విత్తుకుంటే పత్తి దిగుబడి తగ్గదు.
- విత్తిన పది రోజుల్లో మొలక రాకపోతే మళ్లీ విత్తాలి. రెండు మొలకలు ఉన్నచోట ఒకటి తొలగించాలి.
- పత్తి పంటలో మొదట 45 నుంచి 60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.
- కలుపు నివారణకు పత్తి విత్తిన 24–48 గంటల లోపు ఎకరాకు 1.2 లీటర్ల పెండిమిథాలిన్ 30 శాతం లేదా 700 మి.లీ పెండిఇతాలిన్ 38.7 శాతం , సిఎస్ మందు 200 లీటర్ల నీటిని కలిపి నేలపై పిచికారీ చేయాలి. భూమిలో సరైన తేమ/పదును ఉన్నపుడు పిచికారీ చేస్తే గడ్డిమందు సమర్థంగా పనిచేసి 20 రోజుల వరకు కలుపు మొక్కలు లేకుండా చేస్తుంది.
- పత్తిచేను 15–20 రోజుల దశలో ఉన్నపుడు చేనులో సన్న ఆకుల గడ్డి (నాలుగు ఆకులు), వెడల్పాకు (2–3 ఆకులు) కలుపు నివారణకు క్విజలోఫాప్‌ఇథైల్‌లో 400 మి.లీ. లేదాప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ, పైరిథయోబ్యాక్ సోడియం 250 మి.లీ. లేదా పైరిథియోబ్యాక్ సోడియం 6 శాతంతో పాటు క్విజలోపాప్ ఇథైల్ 4 శాతం , ఎంఈసీ 500 మి.లీలను 200 లీటర్లలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి
- ఎకరానికి 110 కిలోల యూరియా, 150కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- భాస్వరం ఎరువు మొత్తాన్ని దుక్కిలో లేదా విత్తిన 15 రోజుల్లో వేసుకోవాలి.
- విత్తిన 20, 40, 60, 80 రోజుల్లో 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి నాలుగు సార్లు వేసుకోవాలి. పైపాటుగా డీఏపీ లేదా కాంప్లెక్స్ (20.20.0.13) ఎరువును వాడకూడదు.
- పత్తిచేను బెట్ట లేదా అధిక వర్షాలకు గురైనప్పుడు పత్తి పెరుగుదలకు 19.19.19 లేదా 13:0:45 లాంటి పోషకాలను లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- పత్తిచేనులో పత్తి మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతే వేరుకుళ్లుగా భావించి, నివారణకు కార్బండాజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల చుట్టూ వేరు బాగా తడిచేలా పోయాలి.
- పత్తిలో మొదట 30–45 రోజుల్లో రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిటీమిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథక్సామ్ 0.2 గ్రా లేదా ఫెప్రోనిల్ లీటరు నీటికి కలుపుకుని పిచికారీ చేయాలి.

‘నవోదయ’లో క్లస్టర్ స్పోర్ట్స్ మీట్

హాజరైన వివిధ జిల్లాల నవోదయ విద్యార్థులు



క్రీడా పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు



ఖో-ఖో పోటీలో తలపడుతున్న బాలికలు

కూసుమంచి: మండలంలోని పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం క్లస్టర్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. తొలుత ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసులు క్రీడా పతాకాన్ని ఎగురవేయగా, క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటడం ద్వారా ఉన్నత స్థాయికి చేరొచ్చని చెప్పారు. ఇక్కడ పోటీల్లో ప్రతిభ చాటిన 250మందిని రీజినల్ స్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.

345 మంది క్రీడాకారులు

పాలేరు నవోదయలో మొదలైన క్లస్టర్ స్థాయి పోటీలకు పాలేరుతో పాటు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నవోదయ విద్యాలయాల విద్యార్థులు 345 మంది హాజరయ్యారు. ఇందులో 183 మంది బాలురు, 162 మంది బాలికలు ఉన్నారు. వీరికి అండర్-14, 17, 19 విభాగాల్లో బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, ఖో-ఖో, యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. కాగా గురువారంతో పోటీలు ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పొలంలో వ్యవసాయ కూలీ మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

టేకులపల్లి: వరి పొలంలో గొర్రు కొడుతుండగా అకస్మాత్తుగా కుప్పకూలి వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని బొమ్మనపల్లికి చెందిన కౌలు రైతు దొడ్ల శంకర్ యాదవ్ బుధవా రం తన వరిపొలంలో గొర్రు కొట్టేందుకు మంగ్యతండాకు చెందిన బాణోత్ వీరు (60)ను పిలిచాడు. గొర్రు కొడుతున్న క్రమంలో వీరు కుప్పకూలి కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే చికిత్స కోసం బొమ్మనపల్లికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని తన ఇంటివద్ద ఉంచి కౌలు రైతుమృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి, మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశా రు. ఘర్షణ వాతావరణ నెలకొనడంతో సమాచారం తెలుసుకున్న టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్‌ఐలు రాజేందర్, శ్రీకాంత్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. కాగా పోలీసులు వెళ్లాక పెద్ద మనుషులు చర్చించి మృతుడి కుటుంబానికి రూ.లక్ష పరి హారం ఇచ్చేలా ఒప్పందం చేసినట్లు సమాచారం.

ఊపందుకోనున్న వరినాట్లు



బూర్గంపాడు మండలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

- రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు
- చెరువులు, కుంటల్లోకి చేరుతున్న నీరు

బూర్గంపాడు: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. వర్షాభావంతో ఈ నెల మొదటివారం నుంచి ప్రారంభం కావాల్సిన వరినాట్లు ఆలస్యమయ్యాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులకు, కుంటలకు నీరు చేరుతోంది. దీంతో వరినాట్లు వేగం పుంజుకుంటున్నాయి. ఈ ఏడాది జిల్లాలో సుమారు 1.95 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేసే అంచనాలున్నాయి. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తుండటంతో ఈసారి అధిక సంఖ్యలో రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర రూ.69 పెంచింది. దీంతో క్వింటా ధాన్యం ధర రూ.2,369 చేరింది. రాష్ట్ర ప్రభుత్వ బోనస్‌తో కలిపి క్వింటా ధాన్యానికి రూ.2,869 ధర దక్కనుంది. దీంతో రైతులు సన్నరకం ధాన్యం సాగుకు మొగ్గు చూపుతున్నారు. జూన్ రెండో వారం నుంచి వరినార్లు పోసుకున్నారు. అడపాదడపా వర్షాలకు నార్లు మొలకెత్తినా, ఆ తర్వాత సరిపడా వర్షం లేకపోవడంతో వడబడ్డాయి. కొందరు రైతులు ట్యాంకర్లతో తడిపి నారు బతికించుకున్నారు. చెరువులు, కుంటలు, లిఫ్టిరిగేషన్ స్కీమ్‌లు, తాలిపేరు ప్రాజెక్ట్, ఇతర చిన్నతరహా ప్రాజెక్ట్‌ల కింద కూడా వరినాట్లు మొదలయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఒకేసారి వరినాట్లు ప్రారంభం కావటంతో కూలీల కొరత ఏర్పడుతోంది. స్థానికంగా ఉన్న కూలీలు సరిపోకపోవటంతో ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. బెంగాల్, బిహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కూలీలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరినాటుకు వస్తున్నారు. కూలీలకు బాగా డిమాండ్ ఏర్పడగా, ధర పెంచుతున్నారు. గతేడాది ఎకరా వరినాటుకు రూ.4 వేల నుంచి రూ.4,500 వరకు చెల్లించారు. ప్రస్తుతం రూ. 5వేలు, అంతకు పైగానే చెల్లిస్తున్నారు. కొంత ఆలస్యమైనా వరినాట్లు పడుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

16మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సత్తుపల్లి: సత్తుపల్లి మండలంలోని వివిధ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 16మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వీరినుంచి రూ.13,250 నగదుస్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రుద్రాక్షపల్లి, రేజర్లలో ఎనిమిది మంది చొప్పున అరెస్ట్ చేశామని సీఐ టి.శ్రీహరి తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

సత్తుపల్లి: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సత్తుపల్లి మండలం గంగారం వద్ద సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ప్రదీప్ తెలిపారు. ఏపీలోఇ కొవ్వూరు రేవు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈమేరకు టిప్పర్ డ్రైవర్ కర్రి కార్తీక్, యజమానులు నల్లరాజు, ఎర్రంశెట్టి రాజశేఖర్, ఇసుక అమ్ముతున్న గంగారం వాసి బండారు రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్యాటరీలు చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక దగ్గర నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద నుంచి బుధవారం మూడు బ్యాటరీలు చోరీ చేశారు. జేబీసీకి చెందిన రెండు బ్యాటరీలు, జనరేటర్‌కు చెందిన బ్యాటరీని దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.35వేల వరకు ఉండొచ్చని తెలిసింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

టేకులపల్లి: చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. టేకులపల్లి ఎస్‌ఐ ఎ.రాజేందర్ కథనం ప్రకారం... మండలంలోని పాతలచ్చగూడెం గ్రామానికి చెందిన కొమరం హనుమంతు(58), చింత నగేష్, ఏపె శ్రీలత అదే గ్రామానికి చెందిన కుంపటి నరేష్ ఆటోలో మంగళవారం లచ్చగూడెం నుంచి టేకులపల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో దంతెలతండా సమీపంలోని చెరువు గట్టు వద్ద ఆటోను వెనుక వస్తున్న బొలెరో ట్రాలీ ఢీకొట్టింది. దీంతో హనుమంతు, ఏపె శ్రీలతకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం హనుమంతును మెరుగైన వైద్యం ఖమ్మం తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు వీరభద్రం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి, సంతాపం తెలిపారు. కుటుంబాన్ని ఓదార్చారు.

40 కేజీల బెల్లం స్వాధీనం

టేకులపల్లి: ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం మండలంలోని బొమ్మనపల్లి క్రాస్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బిల్లుడు తండాకు చెందిన బానోతు కిషన్ బైక్‌పై 40 కేజీల బెల్లం, రెండు కేజీల పటిక, రెండు లీటర్ల నాటు సారా తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసునమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ వేపలగడ్డ తండాలో ఓ వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ధరావత్ రమేష్ (35) భార్యతో ఘర్షణ వల్ల ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. బుధవారం ఉదయం ఇంటి సమీపంలోని జామాయిల్ తోట పక్కనే ఉన్న చెట్టుకు వేలాడి ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. గ్రామంలో విచారణ చేపట్టారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రామస్తులు ఫిర్యాదు చేయగా ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం వారిని వదిలేశారు. కాగా రమేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈతకు వెళ్లి మృత్యు ఒడిలోకి..


బూర్గంపాడు: మండలంలోని పినపాక పట్టీనగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి బుధవారం సీతారామ కాలువలో దిగి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన స్నేహితులు బొర్రా శివ(16), పోలూరు నందు, గద్దల బాబు, ఐలపాక కిరణ్ పాత పినపాక పట్టీనగర్‌కు సమీపంలోని సీతారామ కాలువ వద్దకు వెళ్లారు. శివ, నందు ఈత కొడదామని కాలువలోకి దిగారు. భారీ వర్షానికి కాలువలోకి నీరు చేరి లోతు ఎక్కువగా ఉండటంతో శివ(16) గల్లంతయ్యాడు. దీంతో నందు భయంతో ఒడ్డుకు చేరుకోగా, ఒడ్డున ఉన్న మిగతా ఇద్దరు గల్లంతైన మిత్రుడి కోసం కేకలు వేసుకుంటూ గ్రామంలోకి వచ్చి తెలిపారు. దీంతో గ్రామస్తులు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ప్రసాద్ ఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. లైట్లు వేసి గాలింపు చర్యలు కొనసాగించగా, మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు రమేష్, దేవితోపాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

పాలేరు ఏటిలో యువకుడి గల్లంతు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన ఎస్.ఆదిత్య(19) పాలేరు ఏటిలో గల్లంతైనట్లు తెలిసింది. ఆయన బుధవారం సాయంత్రం గ్రామంలోని పాలేరు ఏటి వద్దకు వెళ్లగా తిరిగి రాలేదు. దీంతో నీటి ఉధృతిలో గల్లంతై ఉంటాడనే భావనతో కుటుంబీకులు, స్థానికులు రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదని సమాచారం. అయితే, ఆయన ఏటి వద్దకు ఎందుకు వెళ్లాడు, చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పడ్డాడా, ఎవరైనా కావాలనే ఏటిలోకి తీసుకెళ్లారా అన్నది తెలియాల్సిఉంది.

దంత సేవలు అంతంతే...

- ఖమ్మం పెద్దాస్పత్రిలో వేధిస్తున్న పరికరాల కొరత
- సరైన సేవలు అందక ప్రైవేట్‌కు బాధితులు
- గత ఏడాది మొత్తం 4,873 మందికే సాధారణ సేవలు



ఓపీలో పాడైపోయిన డెంటల్ చైర్

ఖమ్మంవైద్యవిభాగం: మానవ శరీరంలో అన్ని అవయవాల మాదిరిగానే దంతాలకు సైతం సమస్యలు వస్తుంటాయి. అయితే, దంత సమస్యలు త్వరగా నయం కావు. ఇందుకోసం వివిధ దశల్లో చికిత్స చేయించుకోవాల్సి ఉంటుంది. అలా జరగకపోతే ఇతర శారీరక సమస్యలు వచ్చే ప్రమాదముంది. ప్రధానంగా పరిశుభ్రత పాటించకపోతే దంత సమస్యలు వచ్చే అవకాశముండగా... ఖమ్మం జిల్లాలో దంత సమస్యతో బాధపడే వారికి ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యం అందడం లేదు. ఖమ్మంలోని పెద్దాస్పత్రి దంత విభాగానికి నిరుపేదలే వస్తుండగా, వారికి నామమాత్రపు సేవలతోనే సరిపెడుతున్నారు. దీంతో పలువురు తప్పనిసరై ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు.

రోజుకు వంద మందికి పైగానే..

వయస్సుతో సంబంధం లేకుండా ఇటీవల దంత సమస్యతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. పెద్దాస్పత్రిలో ఓపీకి నిత్యం వివిధ సమస్యలతో 1,500మందికి వస్తుండగా, దంత సంబంధిత చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య వందకు పైగానే ఉంటుంది. కానీ ఇక్కడ సాధారణ చికిత్సలే తప్ప మెరుగైన వైద్యం అందకపోవడంతో నానాటికీ ఓపీ తగ్గుతోంది. గత ఏడాది మొత్తంగా పెద్దాస్పత్రిలోని దంత విభాగంలో 4,873 మందికే సేవలు అందాయి. ఆధునిక పరికరాలు లేకపోవడంతో పళ్లు తొలగించడం, కొత్తవి అమర్చడం వంటి మైనర్ చికిత్సలే జరుగుతున్నాయి. దీనికి తోడు ఇటీవల చికిత్సకు ఉపయోగించే కుర్చీ పాడవడంతో సేవలు మరింత మృగ్యమయ్యాయి.

ఓపీ సేవలతోనే సరి

పెద్దాస్పత్రిలోని దంత విభాగంలో అన్ని రకాల సేవలు అందక ఓపీ సేవలతో సరిపెడుతున్నారు. ఈ విభాగంలో రూట్‌కెనాల్, డీప్ క్లీనింగ్,దంతాల ఫిల్లింగ్, కాస్మోటిక్స్ తదితర చికిత్స అందించాల్సి ఉంటుంది. కానీ అందుకుసంబంధించి పరికరాలు సమకూర్చక.. నిపుణులైన వైద్యులు లేకపోవడంతో పెద్దాస్పత్రికి వచ్చేవారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. దంత విభాగంలో ప్రస్తుతం ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. ఇక చైర్, మౌత్ మిర్రర్, డిజిటల్ ఎక్స్‌రే,ప్రొబ్, ఓరల్ కెమెరా, అల్ట్రాసోనిక్ స్కేలర్, పాలిషింగ్ బ్రష్ తదితర పరికరాలు లేకపోవడం.. చైర్ కూడా పాడవడంతో సేవలు నానాటికీ తీసికట్టు అన్న చందంగా మారాయి. సమస్యలతో వచ్చే వారితో మాట్లాడి నొప్పి నివారణ మాత్రలు రాసి పంపిస్తుండడంతో 10 – 15 మందికి మించి రావడం లేదు. అన్ని పరికరాలు సమకూర్చి ఎండీ స్థాయి వైద్యుడికి కేటాయిస్తే పేదలకు మెరుగైన వైద్యంఅందనున్నందున అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఈ ఏడాది ఓపీ వివరాలు

నెల	సంఖ్య
జనవరి	404
ఫిబ్రవరి	401
మార్చి	545
ఏప్రిల్	357
మే	456
జూన్	397
జూలై (ఇప్పటివరకు)	263

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం...



దంత సేవలు అందించే చైర్ పాడైన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో దీన్ని మరమ్మతు చేయించడమా కొత్తది కొనాలో నిర్ణయిస్తాం. ప్రస్తుతం సాధారణ చికిత్సలే అందుతున్నా, ఆధునిక పరికరాలు తెప్పించి మిగతా చికిత్సలు చేస్తాం. ఎండీ స్థాయి వైద్యుడిని కేటాయిస్తే శస్త్రచికిత్సలు అందించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ నరేందర్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్